క్లుప్తంగా

శ్వాసకోశ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ



సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య నిపుణులు

గుడుపల్లె: చిన్న పిల్లల శ్వాస కోశ వ్యాధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పీఈఎస్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శనివారం పీఈఎస్ ఆసుపత్రిలో చిన్న పిల్లల శ్వాసకోశ వ్యాధిపై అవగాహన సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పిల్లలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి వైద్యం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హెచ్ఆర్ క్రిష్ణరావు, వైద్యులు రాజేంద్రనాయుడు, వెంకటరమణ, శ్రీధర్, మోహన్‌రూప పాల్గొన్నారు.

17న సీనియర్ పెన్షనర్లకు సన్మానం

కుప్పంరూరల్: ఈనెల 17న జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ పెన్షనర్లకు సన్మానం చేయనున్నట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పీజీ సెల్వం , ప్రధాన కార్యదర్శి గణేష్ పిళ్లై తెలిపారు. కుప్పం పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో 17న సీనియర్లకు సన్మానం, పెన్షనర్‌ల పితామహుడు నకారాకు నివాళులర్పించనున్నట్లు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలోని పెన్షనర్లు సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా దత్త జయంతి



హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

పుంగనూరు: పట్టణ సమీపంలోని యాబైరాళ్ల మొరవ వద్ద వెలసిన శ్రీదత్త క్షేత్రంలో శనివారం దత్త జయంతి వేడుకలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం గణపతి నవగ్రహ పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

నేడు మహా శంఖాభిషేకం

కుప్పంరూరల్: కుప్పం పట్టణం పాతపేటలోని ప్రసన్న కోదండరామస్వామి ఆలయంలో 108 శంఖువులతో ఆదివారం మహా శంఖాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మహా శంఖాభిషేకం, విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

గిరి ప్రదక్షిణానికి తరలిన భక్తజనం

పుంగనూరు: తమిళనాడులోని తిరువణ్ణామలైలోని శ్రీ అరుణాచలేశ్వరుని గిరి ప్రదక్షిణానికి 6 ఆర్టీసీ బస్సుల్లో భక్తులు శనివారం తరలివెళ్లారు. పౌర్ణమిని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణాలకు తరలివెళ్లడం ఆనవాయితీ. ఏటా ఇక్కడి నుంచి సొంత వాహనాల్లో వెళ్లేవారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు వేయడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్తున్నారు.


ఇమ్మాస్ స్కూల్‌కు పురస్కారం



అవార్డుతో పాఠశాల హెచ్ఎం, నిర్వాహకులు

పలమనేరు: మండలంలోని క్యాటిల్‌ఫాం వద్ద నున్న ఇమ్మాస్ స్విస్ స్కూల్‌కు జాతీయ స్థాయిలో లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు దక్కింది. ఆ మేరకు ఏపీలోని బెస్ట్-5 సీబీఎస్‌సీ పాఠశాలల్లో ఉత్తమ బోధనకు మూడో స్థానం దక్కింది. ఆ మేరకు ఈటీ టెక్ ట్రైల్ బ్లాజర్ సంస్థ హైదరాబాదులోని హైటెక్స్‌లో రెండు రోజుల కిందట నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కాతలీన్ జాకోబ్‌కు ఆ సంస్థ నిర్వాహకులు కేవీ బ్రాహ్మన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

యువకుడిపై వీధి కుక్కల దాడి



చికిత్స పొందుతున్న తపన్

పుంగనూరు: పట్టణంలో రాంగనర్‌లో శనివారం ఒడిశాకు చెందిన కార్మికుడు తపన్ అనే యువకుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పట్టణంలో కుక్కల బెడద రోజురోజుకు తీవ్రం కావడంతో ప్రజలు హడలిపోతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

ఆశలు ఆవరి

అరుగాలం శ్రమించి చమటోడ్చిన అన్నదాతకు చివరికి అప్పులే మిగులుతున్నాయి. కనీసం ఇంటిలో తిండి గింజలైనా వస్తాయనే ఆశతో వరి సాగు చేసిన రైతన్నకు తుపాన్‌లు, చీడ పీడలు, ధరల దెబ్బకు కుదేలవుతున్నారు. కనీసం పంటకు పెట్టిన పెట్టుబడులు సైతం రావడం లేదు. ఈ సీజన్‌లో అమాంతం క్వింటా రూ.500 తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అటు ఇంటిలోకి తిండిగింజలు రాక.. ఇటు పంటపై ఆదాయం దక్కక మరోవైపు కుటుంబాలను పోషించలేక .. వరి రైతులకు ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయి. -పలమనేరు

- రైతు కష్టం నేలపాలు
- సాగుకు ఎకరానికి రూ.44 వేల దాకా ఖర్చు
- ఇప్పుడున్న ధర క్వింటాకు రూ.2500 మాత్రమే
- పెట్టిన పెట్టుబడులు దక్కని వైనం
- ఈ దఫా వరి రైతుల పరిస్థితి దయనీయం





పలమనేరులో సాగు చేసిన వరి, (ఇన్‌సెట్) వరి నూర్పిడి చేస్తున్న రైతు

ఏ పంట సాగు చేసినా నికర లాభాలు లేనందున పలువురు రైతులు కనీసం తిండి గింజలైనా దక్కుతాయని వరి పంట సాగుపై మొగ్గు చూపారు. పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో ఈ రబీ సీజన్‌కు సంబంధించి సుమారు 3 వేల ఎకరాల్లో వరి సన్న రకాలైన బీపీటీ, నర్మద, అమన్, ధనిష్ఠ, దొడ్డ రకాలైన జేజీఎల్, ఆర్ఎన్ఆర్ లాంటి రకాలను సాగు చేశారు. ఇందులో 2 వేల ఎకరాల దాకా ఇప్పటికే ఒబ్బిళ్లు జరిగాయి. మరో వెయ్యి ఎకరాల్లో వరి కోతలు జరగాల్సి ఉంది. ఉన్నట్టుండి ధాన్యం ధరలు తగ్గాయి. మొన్నటి దాకా క్వింటా ధర రూ.3 వేలు ఉండగా ఇప్పుడు రూ.2,500 సైతం కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. కనీసం పెట్టిన పంట పెట్టుబడి దక్కడం లేదు. ఎన్నో ఇబ్బందులు పడి వరిని పండిస్తే తీరా రైతుకు మిగిలేది కష్టం తప్ప మరేమీ మిగలడం లేదు.

పంట సాగుకు అధిక వ్యయం

ఎకరా పొలానికి వరి విత్తనాలు తెచ్చి నారుమడిని వేయడానికి రూ.2 వేలు. ఆపై బురదమడి దున్నడానికి ట్రాక్టరుకు గంటకు రూ.1,200 చొప్పున ఏడు గంటలకు రూ.9,600, మడి చుట్టూ గెనాలు కొట్టేందుకు రూ.3 వేలు, నాటేందుకు ముందు పొలంలో రెండు బస్తాల కాంప్లెక్స్ ఎరువుకు రూ.2,600, ఇక వరినాట్లకు రూ.7 వేలు, ఆపై చెత్త తీసేందుకు రూ.3 వేలు అవుతోంది. ఈ సమయంలో యూరియా కోసం రూ.1200 పెట్టాలి. పంటకు చీడ పీడల నివారణకు పురుగు మందుల కోసం రూ.1000 అవుతుంది. పంటకోత



ఎండబెట్టి బస్తాల్లో నింపిన ధాన్యం

కొచ్చాక యంత్రాల ద్వారా అయితే రూ.11 వేలు, కూలీలతో అయితే రూ.10 వేలు అవుతుంది. కూలీల డిమాండ్ కారణంగా ఎక్కువ మంది సమయం కలిసొస్తుందని యంత్రాలతోనే ఒబ్బిళ్లు చేయిస్తున్నారు. ఇవన్నీ పూర్తయి ధాన్యాన్ని ఎండబెట్టి బస్తాల్లోనింపేందుకు మరో రూ.2 వేలు పెడితే ధాన్యం ఇల్లు చేరుతుంది. మొత్తం మీద నారుపోసినప్పటి నుంచి ధాన్యం ఇల్లు చేరేందుకు ఎకరా పొలంలో రైతుకు అయ్యే ఖర్చు రూ.43,400 అవుతోంది.

ఎకరానికి మిగిలేది ఇంతే..

ఎకరా పొలంలో పంటబాగా పండితే 40 బస్తాలు (బస్తా 80 కేజీలు) లెక్కన 32 క్వింటాళ్ల దిగుబడిగా ఉంటుంది. ఇప్పుడున్న ధరల మేరకు క్వింటా రూ.2500 చొప్పున రూ.80 వేలు చేతికొస్తుంది. ఇందులో రైతు పెట్టిన పంట పెట్టుబడి రూ.44 వేలు పోతే రూ.36 వేలు మిగులుతుంది. రైతు పంటకు పెట్టిన పెట్టుబడి రూ.44 వేలు అయితే రైతుకు చివరికి వచ్చిన నష్టం రూ.8 వేలు. దీంతో పాటు ఐదు నెలల పాటు వరి పంటసాగు కోసం ఆరైతు పడిన కష్టం నేలపాలైనట్లే.

పొలాలు బీడు పెట్టడమే నయం

ఎకరా పొలంలో రూ.44 వేలు ఖర్చు పెట్టి ఇప్పుడున్న ధరల్లో రూ.8 వేల నష్టానికంటే పొలాలను బీడుగా పెట్టుకోవడమే మేలనే మాట రైతులో వినిపిస్తోంది. పంట సాగు కంటే అయిదు నెలల పాటు కూలీ పనులకెళ్లినా రోజుకు రూ.500 చొప్పున నెలకు రూ.15 వేలు అయిదు నెలలకు రూ.75 వేలు ఎలాంటి పెట్టుబడి లేకుండా మిగులుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయంపై మక్కువ



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తూ ప్రస్తుతం వర్క్‌ఫ్రమ్ హోమ్ చేస్తున్నా. ఎలాగూ పొలాలున్నాయి. దీంతో సేద్యంపై మక్కువతో ఈ దఫా రెండెకరాల్లో వరి సాగు చేశా. 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పుడున్న ధరలతో రూ.1.50 లక్షలన్నమాట. ఇందులో పంట సాగుకు రూ.80 వేలు ఖర్చులు పోతే రూ.70 వేలు వచ్చింది. అంటే 10 వేలు నష్టం వాటిల్లింది. ఆ లెక్కన ఈ పంట చేయడం కంటే మార్కెట్‌లో కొనుక్కోవడమే మేలని అనిపించింది. నేనైతే సాఫ్ట్‌వేర్ కాబట్టి పర్వాలేదు. దీనిపై ఆధారపడిన రైతుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది.

-కిరణ్, జీడిమాకులపల్లి, గంగవరం మండలం

మాజీ సీఎంను కలిసిన మైనారిటీ నేత



మాజీ సీఎం జగన్‌ను కలిసిన సర్దార్ దంపతులు

కుప్పంరూరల్: వైఎస్సార్‌సీపీ కుప్పం నియోజకవర్గ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సర్దార్, ఆయన భార్య కుప్పం మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యురాలు కుర్షిద్ భాను శనివారం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుప్పంలో మైనార్టీ సోదరుల సమస్యలు, పార్టీ పరిస్థితిని మాజీ సీఎంకు వివరించారు. అదే విధంగా తనకు రావాల్సిన షాదీమహల్ బిల్లులు రాకుండా అధికార పార్టీ అడ్డుకుంటున్న వైనాన్ని అధినేతకు వివరించారు. త్వరలో అన్ని సమస్యల పరిష్కారం లభిస్తుందని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు సర్దార్ తెలిపారు.

రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం



రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న బెంగళూరు యూనివర్శిటీ బృందం

పుంగనూరు: పట్టణంలోని ఎంసీవీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఇరవై సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న రామకృష్ణకు శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. బెంగళూరుకు చెందిన భారత్ వర్చువల్ యూనివర్శిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ వారు ఆయన సేవలను గుర్తించి డాక్టరేట్‌తో పాటు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రిన్సిపల్‌ను అభినందించారు.

కేసుల పరిష్కారంలో లోక్ అదాలత్ కీలకం





మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, పుంగనూరు: కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి అరిఫాషేక్

పలమనేరు: కేసుల పరిష్కారంలో జాతీయ లోక్ అదాలత్ కీలకమని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ పేర్కొన్నారు. ఆ మేరకు స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో రూ.73.84 వేల రూపాయల విలువైన 130 కేసులు రాజీ కుదిరాయి. ఈ సందర్భంగా జరిగిన ముందస్తు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాజీ మార్గమే రాజమార్గం కావున కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా కేసులను రాజీ చేసుకుని శాంతిపూర్వకంగా ఉండేలా జీవించాలన్నారు. ఇందులో ప్రిలిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చునని సూచించారు. చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకొనేందుకు ఇది మంచి అవకాశమన్నారు. ముఖ్యంగా పోలీసులు పెండింగ్ కేసుల రాజీకి కృషి చేయాలని సూచించారు. అనంతరం జరిగిన లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారం అయ్యాయి.

సమస్యలకు చెక్ పెట్టేందుకే..

పుంగనూరు: ప్రజలను పీడిస్తున్న అన్ని రకాల సమస్యల పరిష్కారాలకు చెక్ పెట్టేందుకు లోక్ అదాలత్‌ను వేదికగా చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి అరిఫాషేక్ కోరారు. శనివారం కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌ను న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అకుల చెన్నకేశవులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్ కేసులు 121 పరిష్కరించారు. ఇందులో కక్షిదారులకు రూ.45 లక్షలు పంపిణీ చేయించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్రజలకు ఎదురైయ్యే సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రతి ఒక్కరు మధ్యవర్తిత్వం నిర్వహించాలన్నారు. అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే కోర్టులలో దావాలు దాఖలు చేయాలన్నారు. కేసుల వలన తీవ్రమైన వ్యయప్రయాసలకు గురికావాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు పట్టింపులకు పోకుండా పట్టువిడుపు ధోరణిలో స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పేందుకు రాజీమార్గం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శివశంకర్ నాయుడు, భాస్కర్‌రెడ్డి, కిషోర్, నూరి పాల్గొన్నారు.

అఖండ హరి నామస్మరణ

వి.కోట: పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వైభవంగా హరి నామస్మరణ భజన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి శనివారం ప్రత్యేక భజన బృందంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ భజనలో ప్రజలు, పట్టణ ప్రముఖుల ఆధ్వర్యంలో 10 ఏళ్లుగా కొనసాగుతోందని చెప్పారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ నేతలు

వి.కోట: హిందూ ఆలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వీహెచ్‌పీ ప్రఖండ అధ్యక్షుడు సిద్దయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వేణుగోపాలస్వామి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో హైందవ శంఖారావానికి సంబంధించిన కరపత్రాలను, గోడ పత్రికలను ఆవిష్కరించారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని నిరసన

పలమనేరు: స్మార్ట్ మీటర్లను పెడితే ధ్వంసం చేయాలని చెప్పిన చంద్రబాబు మళ్లీ వాటినే ఎందుకు పెట్టాలనుకుంటున్నారని ఇప్పటికైనా స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని స్థానిక సీపీఎం నాయకులు పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి హంగేరీ ఓబుల్‌రాజు మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు మాట మార్చి ప్రజలను నిలువునా ముంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల మోటార్లకు మీటర్లు పెట్టి వారికి తీరని ద్రోహం చేసేందుకు కూటమి సర్కార్ సిద్ధమైందని ఆరోపించారు. ఇప్పటికైనా పాత విధానాన్ని పాటించాలని లేకుంటే రైతులే రోడ్లపైకొచ్చి ప్రజా ఉద్యమంగా మారడం ఖాయమన్నారు. నిరసనలో వాడ గంగరాజు, ఈశ్వర్, గిరిధర్ గుప్తా, రాజ, జయంతి తదితరులు పాల్గొన్నారు.



ఏడీ కార్యాలయం వద్ద సీపీఎం నేతల నిరసన

జర్నలిస్టులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కుప్పం: సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజ్‌కు వెళ్లిన 'సాక్షి' విలేకరులపై రాజకీయ నేతలు దాడి చేయడం అమానుషమని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా సహాయ కార్యదర్శి వెంకటాచలం పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ కడప జిల్లా వేముల తహశీల్దార్ కార్యాలయం వద్ద సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజ్‌కు వెళ్లిన మీడియా ప్రతినిధులపై టీడీపీ కార్యకర్తలు దాడి చేయడం దారుణమన్నారు. ఈ సంఘటనకు నిరసనగా శనివారం కుప్పం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతూ నిందితులపై చర్యల తీసుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి.. దాడికి పాల్పడిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండు చేశారు. విలేకరులపై దాడులు అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ విలేకరులు హరినాథ్, చలపతి, సుబ్రహ్మణ్యం, రోహిత్, గణేష్, నాగరాజు, సంపత్, తేజా, హరి, ఉదయ్, ఆనంద్, కిరణ్, కుమార్, రవికుమార్, మంజునాథ్, సెంథికుమార్, నాగరాజు, బసవశంకరప్ప పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నిక ఏకపక్షం

- కూటమికి తొత్తులుగా అధికారులు
- ముందుగానే అభ్యర్థుల ఖరారు
- మొక్కుబడిగా ఎన్నికలు



సదుం: చెరుకువారిపల్లెలో డిక్లరేషన్ అందుకుంటున్న సభ్యులు

పలమనేరు: నియోజకవర్గంలో శనివారం జరిగిన నీటి సంఘం ఎన్నికలు కూటమి నేతల ఆధ్వర్యంలో ఏకపక్షంగా జరిగాయి. ఈ ఎన్నికలను ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ బహిష్కరించింది. ఇక ఎవరైనా తటస్థులు బరిలో దిగుదామన్నా అధికారులు వారికి చుక్కలు చూపించారు. ఇక్కడ జరిగిన ఎన్నికలను చూసిన ఆయకట్టు రైతులు ఇంత మాత్రానికి ఎన్నికల దేనికోనని మాట్లాడుకోవడం కొసమెరుపు.

అంతా మాఇష్టం...

పలమనేరు డివిజన్‌కు సంబంధించి వీకోటలో 3, బైరెడ్డిపల్లి 2, పలమనేరు 4, గంగవరం 4, పెద్దపంజానిలో 7 మొత్తం 20 చెరువులకు ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఎవరిని ఎంపిక చేయాలో ముందుగానే ఆయా మండలాలకు చెందిన కూటమి నేతలు ముందుగానే నిర్ణయించుకున్నారు. మరోవైపు ఎన్నికల అధికారులు, పోలీసులు వీరికి సంపూర్ణంగా సహకారాలు అందించారు. దీంతో ఎవరూ నామినేషన్లు వేయకుండా ఏకగ్రీవంగా గెలిచినట్లు చేసుకెళ్లారు.

పుంగనూరు: నీటి సంఘాల ఎన్నికల్లో అధ్యక్ష పదవులను అధికారాన్ని ఉపయోగించి తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎన్నికలను బహిష్కరించింది. తటస్థ రైతులకు సైతం ఎన్‌ఓసీలు ఇవ్వకుండా, డబ్బులు కట్టించుకోకుండా అధికారులు వేధించారు. మండలంలోని నెక్కుందిలో ఓ రైతు నేతకు గ్రామ రైతులు మద్దతు పలికినా అధికారం ముందు న్యాయం తలదించుకోవాల్సి వచ్చింది. పట్టణంలోని పెద్ద చెరువులైన నాలుగు చెరువులలో పుంగమ్మ చెరువుకు చిన్నరెడ్డెప్ప మొదలియార్, సుబ్బమ్మ చెరువుకు షణ్ముగం, రాయలచెరువుకు దేశాది చక్రపాణి, మేలుపట్ల పెద్దచెరువుకు వెంకట్రాజులు చైర్మన్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే మండలంలోని 10 చెరువుల పదవులను అధికార పార్టీ కైవసం చేసుకుంది.

చౌడేపల్లెలో తొమ్మిది.. రొంపిచెర్లలో నాలుగు

చౌడేపల్లె, రొంపిచెర్ల: చౌడేపల్లె మండలంలో శనివారం నిర్వహించిన తొమ్మిది చెరువులకు సాగునీటి ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిసినట్లు ఎన్నికల అధికారి భరత్ తెలిపారు. అలాగే రొంపిచెర్లలో నాలుగు చెరువులకు ఏకగ్రీవంగా ఎన్నికలు టీడీపీ సానుభూతిపరులు ఎన్నికయ్యారు.

సదుం మండలంలో ..

సదుం: మండలంలో ఆరు చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. చెరుకువారిపల్లె అయ్యావాని చెరువుకు రమేష్ రెడ్డి, సదుం సీతమ్మ చెరువుకు పద్మావతమ్మ, తాటిగుంటపాలెం పింఛా ఆనకట్ట వెంకటరమణారెడ్డి, తిమ్మానాయనపల్లె చిక్కరాయ చెరువుకు బసవప్ప, వ్యాసప్ప చెరువుకు వెంకటరమణ, పాలమంద రెడ్డి చెరువుకు మల్‌రెడ్డి ఎంపికయ్యారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: మండలంలోని ఓయస్ కొత్తూరు సమీపంలోని పెద్దచెరువుకు సాగు నీటి సంఘాల ఎన్నికలో బేటప్పనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.





ఓటింగ్ కోసం అన్నదాతల పడిగాపులు, వీకోట మండలంలో అన్నీ ఏకగ్రీవమంటూ ఫొటోలు తీసుకొని అభినందనలు తెలుపుకుంటున్న కూటమి నేతలు

మీడియా స్వేచ్ఛను హరించడం దుర్మార్గం

పలమనేరు: మీడియా స్వేచ్ఛను హరించడం దుర్మార్గమని మానవ హక్కుల సంస్థ జిల్లా నేత మునిరత్నం పేర్కొన్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కడప జిల్లా వేముల మండలంలో నీటి సంఘం ఎన్నికలకు సంబంధించి కవరేజికి వెళ్లిన 'సాక్షి' విలేకరిపై అక్కడి కూటమి నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఇటీవల సుప్రీం కోర్టు సూచనలను సైతం కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ ప్రభుత్వంలో జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చొరవ చూపాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు గుర్రం సుబ్రహ్మణ్యం, సరస్వతి, గుర్రప్ప, రత్నమ్మ, గంగిరెడ్డి, మణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మానవ హక్కుల నేత మునిరత్నం

రక్తమోడుతున్న రహదారులు

- మొగిలిఘాట్ వద్దే ఎక్కువ ప్రమాదాలు
- బైపాస్‌లోని వైఎస్సార్ కూడలిలోనూ ఇదే సమస్య

పలమనేరు: పలమనేరు పట్టణానికి సమీపంలోని హైవేలో కొన్ని ప్రాంతాల్లో జరిగిన చోటే మళ్లీ మళ్లీ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో పోలీసులు, హైవే అధికారులు వేగ నిరోధకాలు, సైన్ బోర్డులను ఏర్పాటు చేసినప్పటికీ అదే ప్రాంతాల్లో ప్రమాదాలు పదే పదే జరుగుతున్నాయి.

మొగిలిఘాట్ యమ డేంజర్

చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్‌లో దశాబ్దాలుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గత పదేళ్లలో ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 56 మంది మృతి చెందారు. దీంతో మొగిలి ఘాట్ అంటే జనం అమ్మో అంటూ హడలిపోతున్నారు. ఘాట్‌లో గాంధీనగర్, దొరచెరువు మలుపు, మొగిలి డౌన్ దాకా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవల అధికారులు ఇక్కడ కిలోమీటర్ మేర స్పీడ్ బ్రేకర్లు, వన్‌సైడ్ సిస్టంను అమలు చేస్తున్నా మళ్లీ అక్కడే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. తాజాగా శుక్రవారం సైతం ఓ అంబులెన్స్ రోడ్డు ప్రమాదానికి గురైంది.

వైఎస్సార్ సర్కిల్ వద్ద మరీ ఘోరం..

పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో వైఎస్సార్ సర్కిల్ వద్ద హైవేపై దండపల్లి వైపు వెళ్లే వాహనాలు, అటువైపు నుంచి టౌన్‌లోకి వచ్చే వాహనాలు ఎక్కువగా ఉంటున్నాయి. అప్పట్లో బైపాస్ రోడ్డును నిర్మించేటప్పుడు ఇక్కడ అండర్ పాస్ వేయకుండానే ఎన్‌హెచ్ అధికారులు రోడ్డును నిర్మించేశారు. దండపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు బైపాస్ హైవేను క్రాస్ చేసే సమయంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ బైపాస్ నిర్మించాక ఇదే చోట 30 వరకు రోడ్డు ప్రమాదాలు జరిగాయి.



మొగిలి ఘాట్‌లో ప్రమాదానికి గురైన లారీలు (ఫైల్)

నాగమంగళం వద్ద ఇలా..

పలమనేరు నుంచి బెంగళూరు, క్రిష్ణగిరివైపు వెళ్లే వాహనాలు నాగమంగళం వద్ద హైవేలోకి చేరుతుంటాయి. నాగమంగళం వద్ద ఉన్న హోటళ్లల్లో భోజనాలు చేసేందుకు లారీలను రోడ్డు పక్కగా పదుల సంఖ్యలో రాత్రిపూట ఆపేస్తుంటారు. బైపాస్‌లోకి వెళ్లే వాహనాలు ఆపి ఉన్న వాహనాల పక్కగా హైవేలో వెళ్లే సమయంలో వేగంగా వచ్చే వాహనాలు వీటిని ఢీకొనడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు తప్పడం లేదు.